క్లుప్తంగా

బాధ్యులకు శిక్ష పడేలా పోరాటం చేస్తాం



అడ్డాకుల: బలీదుపల్లికి చెందిన యువకుడు శ్రీకాంత్ యాదవ్ ఇటీవల మహబూబ్‌నగర్‌లోని ఓ వైన్‌షాపు వద్ద జరిగిన దాడిలో గాయపడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ఆదివారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. శ్రీకాంత్ తల్లిదండ్రులు వెంకటేశ్వరమ్మ, వెంకటేష్‌లను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. దాడి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. శ్రీకాంత్‌పై దాడి చేసిన నిందితులకు శిక్ష పడేలా న్యాయపరంగా పోరాటం చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. అదేవిధంగా బాధిత కుటుంబాన్ని చేవెళ్ల ఏసీపీ బంటు కిషన్, మాజీ జెడ్పీటీసీ రామన్‌గౌడ్‌లు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు గట్టు యాదవ్, పెద్దమందడి బీఆర్ఎస్ అధ్యక్షుడు వేణుయాదవ్, మాజీ ఎంపీపీ దయాకర్, రాచూర్ రాజశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌యాదవ్, సురేష్, మహేశ్వర్‌రెడ్డి, భీంరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆయుర్వేద మందులను వాడాలి



అడ్డాకుల: దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేద మందుల ద్వారా నయం చేయవచ్చని లావణ్య ఆయుర్వేదిక్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు, అడ్డాకుల మండల ఆయుర్వేద వైద్యురాలు లావణ్య అన్నారు. మూసాపేటకి చెందిన జర్నలిస్ట్ ఇటీవల పక్షవాతానికి గురవడంతో ఆదివారం ఆయుర్వేద మందులను ఉచితంగా అందజేశారు. ప్రతి నెలా రూ.12వేల విలువైన మందులను ప్రైవేటులో కొనుగోలు చేసి రెండు నెలలుగా బాధితుడికి అందజేస్తున్నట్లు వివరించారు. ఆయుర్వేద వైద్యంపై ప్రజలు అపోహలు వదిలి దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద మందులను వాడాలని కోరారు. తమ ట్రస్ట్ ద్వారా పేదలకు ఉచితంగా వైద్యం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శెట్టి శేఖర్, మాజీ జెడ్పీటీసీ రామన్‌గౌడ్, అడ్డాకుల ఏఎ శ్రీనివాసులు, ఎంపీటీసీ గోవర్ధన్‌సాగర్, తిరుపతయ్యగౌడ్, ప్రతాప్‌రెడ్డి, మహేందర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌నకు గురై గాయపడ్డ యువకుడు

మిడ్జిల్: మండల పరిధిలోని అయ్యవారిపల్లికి చెందిన శివుడు ఆదివారం ఉదయం గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఘటనలో అతడికి తీవ్ర గాయాలు అయ్యాయని గ్రామస్తులు తెలిపారు. చికిత్స నిమిత్తం జడ్చర్లలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

23 నుంచి కిడ్స్ ఫెస్టివల్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం ఎస్వీఎస్ ఆస్పత్రి ఎదుటగల రెమా చర్చిలో ఈ నెల 23 నుంచి 25 వరకు కిడ్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు పాస్టర్ బీఎస్ పరంజ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బైబిల్‌పై క్విజ్, స్కిట్స్, కొరియోగ్రఫీతోపాటు టాలెంట్ టెస్ట్ నిర్వహించి ప్రతిభకనబరిచిన వారిని ఈ ఏడాది కిడ్స్ విజేతగా ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఎండిన టంకర పెద్ద చెరువు



నీరులేక వెలవెలబోతున్న గొండ్యాల్ చెరువు



బోసిపోయిన హన్వాడ పెద్ద చెరువు

చెరువులు వెలవెల..



పూర్తిగా ఎండిన పెద్దర్పల్లి నోటిఫైడ్ చెరువు

హన్వాడ: మండల పరిధిలో పలు చెరువులు నీళ్లలేక వెలవెల బోతున్నాయి. నీటి మట్టం పూర్తిగా తగ్గడంతో ఆయా గ్రామాల్లో ఉన్న రైతులు పశువులకు నీరు తాగించేందుకు సైతం అవకాశం లేకుండా పోతోంది. మండల పరిధిలో మొత్తం 6 నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. అదేవిధంగా 150 వరకు చిన్నపాటి చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిల్లో దాదాపు అన్ని చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. ముఖ్యంగా నోటిఫైడ్ చెరువులైన హన్వాడ, పెద్దర్పల్లి, ఇబ్రహీంబాద్, టంకర, గొండ్యాల్, వేపూర్‌లలో పరిస్థితి మరి దారుణంగా మారింది. కేవలం హన్వాడ, టంకర, ఇబ్రహీంబాద్ చెరువుల్లో మాత్రం ఉన్న కొద్దిపాటి నీరే కొంతమేర మూగజీవాల దాహార్తి తీరుస్తున్నాయి.

వ్యక్తి అదృశ్యం కేసునమోదు

భూత్పూర్ : మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌నకు చెందిన బోడ మహేష్ అదృశ్యమైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు మహేష్ కొంతకాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలోనే.. వైద్యం కోసం ప్రైవేట్ వ్యక్తుల నుంచి అప్పులు చేశాడు. కాగా ఈ నెల 14న తన సెల్‌ఫోన్ ఇంట్లోనే పెట్టి ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు గ్రామంలో, బంధువుల ఇళ్ల వద్ద ఆచూకీ కోసం వెతికారు. అయినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆదివారం మహేష్ భార్య భాగ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

కనులపండువగా శోభాయాత్ర



శోభాయాత్రలో అడుగుల భజన చేస్తున్న భక్తులు



అమ్మవారు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం బ్రాహ్మణవాడీలోగల శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత జయంతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం అభిషేకం, అలంకరణ, సామూహిక కుంకుమార్చన, నివేదన, నీరాజనం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. సాయంత్రం కల్పవృక్ష వాహనంపై అమ్మవారి శోభాయాత్ర రథోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవాలయం నుంచి గడియారం చౌరస్తా, సగమేశ్వర దేవాలయం మీదుగా అమ్మవారి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో భజనలు, కోలాట ప్రదర్శనలు అలరించాయి. ఉత్సవాల్లో ఆలయ ప్రధాన అర్చకులు గొండ్యాల రాఘవేంద్రశర్మ, పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప జాతర



బీరప్ప జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్: మండల పరిధిలోని పెద్దవార్వాల్‌లో ఆదివారం ఘనంగా బీరప్ప నిర్వహించారు. వేడుకలో పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు స్థానిక ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకున్న అనంతరం తీర్థప్రసాదాలను అందించారు. నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ హయాంలో సంక్షేమపథకాలను ప్రజలకు అందిస్తామని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్, మాజీ సర్పంచ్ నర్సింహరావు, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుక



వర్షంలోనూ బోనాలతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బాలానగర్: మండలంలో బొడ్రాయి పున:స్థాపితం చేసి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఆదివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలు ఊరేగింపు నిర్వహించారు. బొడ్రాయి వద్దకు తీసుకువచ్చి నైవేద్యాలు సమర్పించారు. గ్రామాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. కాగా సరిగ్గా బోనాల ఊరేగింపు చేపట్టిన సమయంలోనే వర్షం ప్రారంభమైంది. కాగా భారీగా వర్షం కురిసినా భక్తులు అలాగే ఊరేగింపులో పాల్గొనడం విశేషం.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

నవాబుపేట: కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన అనంతరం వచ్చిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. తాజాగా గత మూడు రోజులుగా కురుస్తున్న వానలతో చాలా ధాన్యం తడిసిపోయిందని.. కాగా కేంద్రాల చెంత తేమ శాతం ప్రకారం కొనుగోలు చేస్తున్న తరుణంలో తడిసిన ధాన్యం పరిస్థితేమింటంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయంపై వెంటనే స్పందించి తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నారు.

వరదనీరు మళ్లించే పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ కాల్వల ద్వారా వచ్చే వరదను పెద్దచెరువు (మినీ ట్యాంక్‌బండ్) లోకి మళ్లించేందుకు న్యూటౌన్ వద్ద చేపట్టిన పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. ఇటీవల అక్కడ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో బ్రిడ్జిని నిర్మించగా ప్రస్తుతం దాని కింద ఉన్న మట్టిని తొలగిస్తున్నారు. ఈ చెరువు చుట్టూ ఒకవైపు గతంలోనే తవ్విన కాల్వలో మురుగు, ఇక వర్షాలు కురిసినప్పుడు ఈ బ్రిడ్జి కింద నుంచి వరదను లోపలికి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు రామయ్యబౌలి వద్ద గత ఏడాది ఇలాంటి ఏర్పాట్లే చేశారు. కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ షేక్ ఉమర్ పాషా, ఎంఈ యు.బస్వరాజ్, డీఈ భరత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరహరి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వసతి కోసం దరఖాస్తు చేసుకోండి

గండేడ్: హాస్టల్ వసతి అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వెన్నాచేడ్ ఎస్సీ హాస్టల్‌లో ఒకటో తరగతి, ఐదో తరగతుల వారికి అవకాశం ఉందని ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వారు అయి ఉండడమే కాక పట్టణానికి చెందిన వారైతే వార్షిక ఆదాయం రూ. రెండు లక్షలు.. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు అయితే వార్షిక ఆదాయం రూ. 1.5 లక్షలు మించని కుటుంబాలకు చెందిన వారై ఉండాలన్నారు. ఒకటో తరగతికి సంబంధించి జూన్ 1, 2018 నుంచి 2019 మే 31 లోపు జన్మించిన వారు అర్హులన్నారు. అదేవిధంగా కులం, ఆదాయం, నివాస ధ్రువపత్రాలతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తదితరాలను దరఖాస్తుతో పాటు జతపరచాలన్నారు. ఐదోతరగతి వారికి మాత్రం సంబంధిత పాఠశాల బోనఫైడ్‌తో పాటు గెజిటెడ్ అటెస్టేషన్ చేసి జిల్లా డీడీ కార్యాలయంలో ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



దేవరకద్ర: గద్దెగూడెంనకు చెందిన చెన్నరాయుడు గత ఏడాది డిసెంబర్ 25 న అనారోగ్యంతో కారణంగా మృతి చెందారు. ఈ నేపథ్యంలో అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు తనతో పాటు (1997 – 98) పదోతరగతి చదివిన స్నేహితులు ముందుకు వచ్చారు. చెన్నరాయుడి ఇద్దరి కుమార్తెల పేరున సుకన్య సమృద్ధి యోజన పథకం కింద రూ. 50 వేల చొప్పున రూ. లక్ష డిపాజిట్ చేశారు. ఈ మేరకు సదరు డిపాజిట్ కాపీలను ఆదివారం చెన్నరాయుడు భార్య, కుమార్తెలకు అందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అడ్డాకుల: మూసాపేట మండలంలోని జానంపేట, వేముల, నిజాలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ మేరకు వివరాలను విద్యుత్‌శాఖ ఏఈ వెంకటయ్య ఒక ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

యువత క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలి



కబడ్డీ క్రీడాకారులతో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: యువత క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని మెరుగైన ప్రదర్శన కనబరచాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ మార్నింగ్ వాక్ నిర్వహించి అనంతరం వేసవి కబడ్డీ, బాస్కెట్‌బాల్ శిక్షణా శిబిరాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ క్రీడల వల్ల దేహదారుఢ్యం పెంపొందుతుందన్నారు. ఇలాంటి వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, పాపారాయుడు, రాజవర్ధన్‌రెడ్డి, ఆర్.శ్రీనివాసులు, ఖలీల్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 22వ వార్డు పరిధిలోని భగీరథకాలనీలో పావిలియన్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రికెట్ నెట్‌ను ఆదివారం రాత్రి మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచిన్‌టెండూల్కర్, వినోద్‌కాంబ్లీ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారేనన్నారు. క్రికెట్ ఆటపై వారికున్న ఏకాగ్రత వల్ల అందరికీ ఆదర్శప్రాయులుగా నిలిచారన్నారు. క్రీడల్లో యువత రాణించాలని సూచించారు.



ఆడవే మయూరి..!

నవాబుపేట: మండల పరిధిలో చాకలపల్లితండాలో ఆదివారం ఒక ఇంటిపై వాలిన మయూరం వర్షం చినుకులు ఆగిపోగానే పురివిప్పి న్యాటం చేసింది. చాలా అరుదుగా కనిపించే ఈ దృశ్యాన్ని చూసి స్థానికులు పులకించిపోయారు. తమ సెల్‌ఫోన్లలో దృశ్యాన్ని చిత్రీకరించి సంబరపడ్డారు.

ప్రవచన కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలతో శివకుమార్ తదితరులు

జడ్చర్ల టౌన్: జూన్ 1న పట్టణంలో నిర్వహిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి. శివకుమార్ ఆవిష్కరించారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొదట ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా శివకుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మానికి బాసటగా నిలుస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనం కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కరపత్రాల ఆవిష్కరణలో ఆహ్వానసంఘం సభ్యులు శంకర్‌బాబు, మహేశ్వర్, బి.విజయ్‌కుమార్, యం.వేణుగోపాల్, జనార్దన్, గోపాలకృష్ణ, విశ్వనాథం పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఓవర్‌హెడ్ ట్యాంక్



బాలానగర్: ఉడిత్యాలలో ఉన్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. దీంతో ట్యాంకు ఎప్పుడు కూలుతుందో అని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకు పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల ఉండడం, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయని.. పాఠశాల ప్రారంభం కాకముందే చర్యలు చేపట్టాలని స్థానికులు అంటున్నారు. విషయంపై అప్పట్లో గ్రామానికి వచ్చిన కలెక్టర్‌కు సైతం వినతి పత్రం సమర్పించినా నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు. అనుకోని ఘటనలు చోటుచేసుకోకముందే తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఖాతా నుంచి డబ్బులు మాయం

జడ్చర్ల టౌన్: బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయమైన ఘటనిది. మండల పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. ఈ నెల 15న మండలంలోని లక్ష్మణ్ నాయక్‌తండాకు చెందిన యం. థావుర్య ఖాతా నుంచి ఎలాంటి ఓటీపీ రాకుండా.. అతడి ప్రమేయం లేకుండా రూ.36వేలు ఇతరుల ఖాతాలోకి బదిలీ అయ్యాయి. కాగా కనగబాంసింగ్ అనే వ్యక్తికి గూగుల్‌పే ద్వారా రూ.36వేలు బదిలీ అయ్యాయని, తాను మోసపోయినట్లు థావుర్యా గుర్తించారు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్ల సీఐ వివరించారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

నారాయణపేట:స్వాతంత్య్ర సమరయోధులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలాలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన పుచ్చలపల్లి సుందరయ్య ఎంతో సాధారణమైన జీవితం గడిపారని కొనియాడారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అడ్డాకులలో సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అడ్డాకుల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (2001–02వ సంవత్సరంలో పదో తరగతి) పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. చిన్నప్పుడు పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అదేవిధంగా నాడు వారికి చదువులు చెప్పిన గురువులు శ్యాంసుందర్, శ్రీనివాస్, సత్యనారాయణ, రాఘవేందర్‌లను సమ్మేళనానికి ఆహ్వానించారు. వారిని శాలువా పూలమాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. తాము చదువుకున్న పాఠశాల అభ్యున్నతికి కృషి చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాలరాజు, కాశీం, శ్రీధర్, శ్రీను, తిరుమలేష్, కనకయ్య, శ్రీవాణి, లక్ష్మీ, అలివేల, స్వప్న ఉన్నారు.



జడ్చర్లలో..

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్ఆర్‌ప్రభుత్వ డిగ్రీకళాశాల (2001–04 బీకాం) పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కళాశాలలోని పూర్వవిద్యార్థుల అసోసియేషన్ గదిలో సమావేశం అయ్యారు. అప్పట్లో తాము కూర్చున్న తరగతి గదులు, కళాశాల ప్రాంగణం అంతా తిరుగుతూ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. స్టేట్ హెర్బేరియం, బయో డైవర్సిటీ ల్యాబ్ రీసెర్చ్ సెంటర్‌ను పరిశీలించారు. గార్డెన్‌లో మొక్కలు నాటారు. కళాశాల అభివృద్ధికి తమవంతు సహకరించాలని తీర్మానించారు. బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్యను కార్యక్రమానికి ఆహ్వానించారు. పూర్వ విద్యార్థులు జగదీశ్వర్‌రెడ్డి, హరికుమార్, రంజిత్‌కుమార్, రాంచంద్రయ్య, భాగ్యలక్ష్మి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

జోరుగా చెరువుల్లో పూడిక తీత



హన్వాడ: మండలంలోని చెరువుల్లో ఈజీఎస్ పథకం కింద పూడిక తీత పనులు జోరుగా సాగుతున్నాయి. చెరువుల్లోని నల్లమట్టితో సత్తువ వస్తుందని రైతులు ట్రాక్టర్ల ద్వారా పొలాలకు తరలిస్తున్నారు. కాగా భారీగా కూలీలు పూడికతీత పనుల్లో పాల్గొంటున్నారు. మండలకేంద్రంలోని పెద్దచెరువులో ఆదివారం పనులు కొనసాగాయి.



శిక్షణకు వచ్చిన వారికి తర్ఫీదునిస్తున్న కోచ్‌లు



ప్రాక్టీస్‌లో పాల్గొన్న బాలురు



ప్రాక్టీస్ చేస్తున్న అమ్మాయిలు

నేటితో ముగియనున్న క్రికెట్ శిక్షణ శిబిరం

జడ్చర్ల టౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం సోమవారంతో ముగియనుంది. గత నెల 20న ప్రారంభమైన శిబిరంలో ప్రతిరోజు ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. శిబిరంలో అండర్ 10 నుంచి అండర్ 25 వరకు వస్తున్నారు. శిక్షణకు 160 మంది నమోదు అయ్యారు. అయితే 130 మంది నిత్యం శిక్షణకు వస్తున్నారు. వీరిలో 15మంది అమ్మాయిలు ఉన్నారు. జడ్చర్లతో పాటు మరి కొన్ని గ్రామాల నుంచి విద్యార్థులు శిక్షణకు వచ్చారు.